# ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధాని ఆంధ్రుల హక్కు అమరావతి

## కారంపూడిలో కూటమి నేతలు సంబరాలు






పెన్ పవర్ కారంపూడి ఏప్రిల్ 2:-- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏకైక రాజధాని అమరావతిగా కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తూ ఆమోదించడము చాలా హర్షించదగిన విషయం అని కూటమి నేతలు అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు కూటమి పార్టీల నాయకులు గురువారం సాయంత్రం కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద కూటమి పార్టీల నాయకులు పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి, సంబరాలు చేపట్టారు. జై చంద్రబాబు.., జై జై అమరావతి అంటూ నినాదాలతో పట్టణం అంత మార్మోగించారు. అనంతరం వారు మాట్లాడుతూ... నేడు శాశ్వత రాజధానిగ అమరావతిగా చట్టబద్ధత కల్పించి, ఏపీ ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అంకితమించారని కొనియాడారు. పార్లమెంట్లో దేశవ్యాప్తంగా అన్ని పార్టీలు మద్దతిస్తే.. వైసిపి పార్టీ మాత్రం వ్యతిరేకించడం సిగ్గుచేటని మండిపడ్డారు. తెలుగు జాతి ప్రయోజనాల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వ్యక్తి చంద్రబాబు అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాతులూరు సమీపంలో ఘోర ప్రమాదం


## రాంగ్ రూట్‌లో వచ్చి ఆరు బైక్‌లను ఢీకొట్టిన మినీ లారీ



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 02: నాదెండ్ల : గుంటూరు - కర్నూలు జాతీయ రహదారిపై గురువారం భారీ ప్రమాదం చోటుచేసుకుంది. మండలంలోని సాతులూరు రైల్వే స్టేషన్ సమీపంలో అతివేగంతో వచ్చిన ఒక అశోక్ లేలాండ్ మినీ లారీ బీభత్సం సృష్టించింది. సదరు వాహనం రాంగ్ రూట్ (తప్పుడు మార్గం) లోకి ప్రవేశించి, ఎదురుగా వస్తున్న ఆరు ద్విచక్ర వాహనాలను ఒకదాని తర్వాత ఒకటిగా బలంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో నియంత్రణ కోల్పోయిన మినీ లారీ రహదారిపైనే బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బైక్‌లపై ప్రయాణిస్తున్న వారు తీవ్రంగా గాయపడగా, స్థానికులు వెంటనే స్పందించి బాధితులను ఆసుపత్రికి తరలించారు.

# ఏపీ రాజధాని అమరావతి చట్టబద్ధత కల్పించటం

## చారిత్రక విషయం : మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 02: చిలకలూరిపేట: ఏపీ రాజధాని అమరావతి చట్టబద్ధత కల్పించటం చారిత్రక విషయమని మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు చెప్పారు. చిలకలూరిపేట మున్సిపాలిటీలో ఏపీ రాజధాని అమరావతికి పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించటంపై హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది దీపాలు వెలిగించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. దీనికి కారణమైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు , పార్లమెంటు సభ్యులకు, అందరికీ కృతజ్ఞతలు తెలపాలని ఆదేశాలు ఇవ్వటం జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ డీడీఈ షేక్ అబ్దుల్ రహీం, మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది ఉన్నారు.

# అమరావతికి రాజ్యసభ ముద్ర, ఐదు కోట్ల ఆంధ్రుల ఆశల విజయం

### వైసీపీ కుట్రలు సాగవు, అమరావతిపై చంద్రబాబు విజయం చారిత్రాత్మకం

### అమరావతి గెలుపు, రైతుల త్యాగానికి దక్కిన గౌరవం

### ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు










నరసరావుపేట పెన్ పవర్ ఏప్రిల్ 02: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని గుర్తిస్తూ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లుకు నేడు రాజ్యసభలో తుది ఆమోదం లభించడం పట్ల నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది ఐదు కోట్ల ఆంధ్రుల ఆశల విజయమని, ధర్మం గెలిచిందని ఆయన పేర్కొన్నారు. రైతుల త్యాగానికి దక్కిన గౌరవం గత కొన్నేళ్లుగా అమరావతి రాజధాని కోసం రైతులు, మహిళలు నిరంతరాయంగా చేసిన పోరాటం వృథా పోలేదని అరవింద బాబు అన్నారు. భూములిచ్చిన రైతుల త్యాగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సముచిత గౌరవం కల్పించాయని, నేడు రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందడం ద్వారా రాజధానిపై ఉన్న అడ్డంకులన్నీ పూర్తిగా తొలగిపోయాయని స్పష్టం చేశారు. అమరావతి ప్రపంచ స్థాయి నగరంగా రూపుదిద్దుకోవడం ఖాయమని, దీనివల్ల రాష్ట్రంలో పెట్టుబడులు పెరిగి నిరుద్యోగ యువతకు పెద్దపీట వేస్తూ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ధీమా వ్యక్తం చేశారు. రాజధానికి అత్యంత చేరువలో ఉన్న నరసరావుపేట నియోజకవర్గం కూడా పారిశ్రామికంగా, రియల్ ఎస్టేట్ పరంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వైసీపీ తీరుపై విమర్శలు ఈ సందర్భంగా వైసీపీ వైఖరిపై ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంటులో బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో వైసీపీ ఎంపీలు వాకౌట్ చేయడం ఆంధ్రప్రదేశ్ ప్రజలను వెన్నుపోటు పొడవడమేనని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మూడు రాజధానుల పేరుతో ప్రజలకు పగటి కలలో చుక్కలు చూపించారని, అందుకే నేడు ఆ పార్టీ కొట్టుకుపోయే స్థితికి చేరిందని ఎద్దేవా చేశారు. ఎన్ని కుట్రలు చేసినా నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ ఐక్యంగానే ఉంటుందని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అవినీతికి పాల్పడిన వ్యక్తి అని, ఆయన చేసే విమర్శలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని పేర్కొన్నారు. ఘనంగా సంబరాలు ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు గానూ ప్రధాని నరేంద్ర మోదీకి, అమిత్ షాకు మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి, నరసరావుపేట ప్రజల తరపున ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా గురువారం టీడీపీ శ్రేణులు పార్టీ కార్యాలయం నుండి పల్నాడు రోడ్డులోని నందమూరి తారక రామారావు విగ్రహం వరకు భారీ ర్యాలీ గా జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లపాటి రాము మరియు నాయకులు కార్యకర్తల కార్యక్రమం నిర్వహించి, మిఠాయిలు పంచి టపాసులు కాల్చి దీపాలు వెలిగించి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమానికి భారీగా ప్రజలు మరియు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

# శ్రీ కళ్యాణం వెంకటేశ్వర స్వామి వారి దేవస్థాన మహోత్సవంలో

## పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు





నర్సరావుపేట పెన్ పవర్ ఏప్రిల్ 02: నర్సరావుపేట పట్టణంలోని గురువారం మున్సిపల్ ఆఫీస్ సమీపంలో వెలసిన శ్రీ కళ్యాణం వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో అత్యంత వైభవంగా జరుగుతున్న శ్రీవారి అష్ట బంధన సంప్రోక్షణ మహా కుంభాభిషేక మహోత్సవంలో స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆలయానికి చేరుకోగా ఆలయ అర్చకులు మరియు కమిటీ సభ్యులు వారికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. శాస్త్రోక్తంగా జరుగుతున్న కుంభాభిషేక క్రతువులను ఎమ్మెల్యే పరిశీలించారు. లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న ఈ మహా యజ్ఞంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు ఎమ్మెల్యే కి వేద ఆశీర్వచనం అందించి, స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. స్వామి వారి కృపతో నర్సరావుపేట నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పట్టణం మరింత అభివృద్ధి పథంలో పయనించాలని కోరుకున్నట్లు ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, స్థానిక నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మారుమోగాయి.

# వాటర్ ఏరో డ్రోమ్ ప్రాజెక్టులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి




సీలేరు (అల్లూరి జిల్లా) : పెన్ పవర్, ఏప్రిల్, 02 : అల్లూరి జిల్లా జికె.వీధి మండలం సీలేరులో ఏర్పాటు చేస్తున్న వాటర్ ఏరోడ్రోమ్ ప్రాజెక్టులో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, స్థానికులు కోరారు. గురువారం సీలేరులోని ఎపి జెన్‌కో కల్యాణ మండపంలో వాటర్ ఏరోడ్రోమ్ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం గ్రామ సభ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ మాట్లాడుతూ.. సీలేరు పంచాయతీ పరిధిలో అర్హత కలిగిన యువతను 50 మందిని గ్రామ పెద్దలు ఎంపిక చేస్తే ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. 15 మందికి సెక్యూరిటీ గార్డులుగా, 11 మందికి ఫైర్, పెట్రోలింగ్ సిబ్బందిగా తీసుకుంటామని, మిగిలిన ఉద్యోగాలను వారి అర్హతలను బట్టి ఇస్తామని తెలిపారు. ఆ యువతకు ఎడ్యుకేషనల్ విభాగం నుంచి నైపుణ్య శిక్షణ ఉంటుందన్నారు. ప్రధాన రహదారి నుంచి సీ ప్లేన్ కోసం ఎంపిక చేసిన స్థలం వరకు 1.5 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణాన్ని ప్రాజెక్టు అధికారులే చేపడతారన్నారు. గ్రామ సర్పంచ్ దుర్గో, ఎంపిటిసి పిల్లా సాంబమూర్తి, ఉప సర్పంచ్ ప్రసాద్, డిసిసి కార్యదర్శి కారే శ్రీనివాస్, టిడిపి నాయకులు బొర్రాకృష్ణ, చిటికెల రాము మాట్లాడుతూ... ఏరో డ్రోమ్ ప్రాజెక్టు ఏర్పాటుపై తమకు ఎటువంటి అభ్యంతరమూ లేదని, స్థానిక యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఆర్వి నగర్ నుంచి పాలగెడ్డ వరకు అస్తవ్యస్తంగా ఉన్న రహదారి నిర్మాణ పనులు పూర్తి చేస్తేనే ఈ ప్రాంతానికి పర్యాటకులు వచ్చే అవకాశముందన్నారు.

# దాహమని వచ్చి అత్యాచారం



మాచర్ల (పల్నాడు జిల్లా) : పెన్ పవర్, ఏప్రిల్, 02 : పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలో సభ్య సమాజం తలదించుకునే అమానుష ఘటన జరిగింది. ఒంటరిగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగినిపై ఓ దుర్మార్గుడు లైంగిక దాడికి పాల్పడటమే కాకుండా ఆమెను హత్య చేసేందుకు యత్నించాడు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు...పట్టణంలోని ఓ మహిళ స్థానిక ప్రభుత్వ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం సుమారు మూడు గంటల సమయంలో గుర్తు తెలియని దుండగుడు వచ్చి మంచినీరు కావాలని అడగడంతో నీరు తెచ్చేందుకు ఆమె ఇంటి లోపలికి వెళ్లిపోయారు. దుండగుడు ఆమెను అనుసరిస్తూ ఇంట్లోకి చొరబడ్డాడు. కత్తితో బెదిరించి, చున్నీతోనే కాళ్లు చేతులు కట్టివేసి అత్యాచారానికి ఒడిగట్టాడు. విషయం బయటకు రాకుండా ఉండేందుకు ఆమెను చంపాలని భావించి సున్నిత ప్రదేశంలో ఇనుప రాడ్డుతో పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. బాధితురాలు స్పృహ తప్పిపోవడంతో చనిపోయిందని భావించి దుండగుడు అక్కడి నుంచి పరారయ్యాడు. కొంతసేపటికి స్పృహలోకి వచ్చిన బాధితురాలు సత్తెనపల్లిలోని తన తల్లికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. తల్లి తన కుమారుడికి ఫోన్ చేసి, అక్కను కాపాడాలని కోరారు. అతను తన స్నేహితులకు చెప్పగా వారు స్థానికుల సహాయంతో బాధితురాలి కట్లు తొలగించి పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు వెంటనే బాధితురాలిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

